ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్ పంపిణీ



మహిళకు ఉచిత ఉజ్వల గ్యాస్‌ను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బోరబండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బోరబండ సైట్-3లో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మహిళలకు ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు అండగా ఉండడానికి గ్యాస్ బండను సబ్సిడీ ధరకు అందిస్తూ ఉచిత గ్యాస్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దీపక్ రెడ్డి, షర్మిలా జాదవ్, కొత్త వెంకటేష్, సురేష్ గౌడ్, రాజ్‌కుమార్, కృష్ణమోహన్, కుమార్‌నాయక్, సతీష్ పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పంజాగుట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ ఆనందనగర్ కాలనీ ఎక్స్ టెన్షన్ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. త్వరలో పార్క్ సంబంధించిన కాంపౌండ్ వాల్, న్యూ బోర్వెల్‌కు సంబంధించిన నిధులు మంజూరు చేస్తానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ప్రేమ్ సింగ్ రాథోడ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎం.రాఘవరెడ్డి, అధికార ప్రతినిధి శ్రవణ్ యాదవ్, గడ్డం వెంకటస్వామి, ఎర్ర శ్రీను, రమేష్, శ్రీకాంత్ యాదవ్, రమేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



పాతంగ్ సినీ యూనిట్‌ను అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

చిన్న చిత్రాలకు మద్దతిస్తాం : మంత్రి కోమటిరెడ్డి

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చిన్న చిత్రాలకు ప్రభుత్వ మద్దతు ఎప్పుడూ ఉంటుందని, చిన్న చిత్రాల వల్ల కూడా సినీ ఇండస్ట్రీకి ఎంతో మేలు జరుగుతుందని, అలాంటివారికి తాను అండగా ఉంటానని సినిమాటోగ్రఫి శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద నేపథ్యంగా దర్శకుడు ప్రణీత్, నిర్మాతలు సంపత్ మాక, విజయ్ శేఖర్ 'పాతంగ్' అనే సినిమాను రూపొందించారు. ఇందులో భాగంగా కొద్ది రోజుల క్రితం 'హే హలో నమస్తే' అనే పాటను విడుదల చేశారు. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల కొద్ది వ్యూస్ రావడంతో మంత్రి ఈ చిత్ర బృందాన్ని బంజారాహిల్స్‌లోని తన నివాసానికి పిలిచి అభినందించారు. ఈసందర్భంగా మంత్రి ఈ సినిమా నేపథ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చిన్న సినిమాల వల్ల ఎంతో మంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లకు ఉపాధి లభిస్తున్నదని, అందువల్ల చిన్న సినిమాలకు ఎటువంటి సహాయం కావాలన్నా ప్రభుత్వం తరపున తాము అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హీరో హీరోయిన్లు వంశీ పుజిత్, ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్‌లతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్ నాని బండ్రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నిఖిల్, రమేష్ మట్టా, రాజేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైద్య సిబ్బంది

మూత్రపిండాల వ్యాధికి మధుమేహమే కారణం

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధికి మధుమేహం ప్రధాన కారణమని విరించి ఆస్పత్రి నెఫ్రాలజీ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాధిపతి డాక్టర్ కేఎస్ నాయక్ తెలిపారు. కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విరించి ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ మూత్రపిండాల వ్యాధి బారినపడుతున్న వారు సగటు వయస్సు 50 సంవత్సరాలు అన్నారు. అందులో 67శాతం పురుషులని తెలిపారు. మూత్రపిండాల వ్యాధిని అరికట్టాలంటే ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. నెఫ్రాలజిస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ స్పెషాలిస్టు ఇంటర్వెన్షనల్ నెఫ్రాలజీ డాక్టర్ నవీన్ కుమార్ మట్టివాడ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి సాధారణ లక్షణాలు వ్యాధి దశపై ఆధారపడి మారవచ్చున్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్ కుమార్ మేడి, సాయి రవిశంకర్ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కిడ్నీపై మాస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో హెల్త్‌లైఫ్ స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్‌ఎల్‌ఎల్) అనుబంధ సంస్థ అపోలో డ యాలసిస్ క్లినిక్‌లు కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో గురువారం నిర్వహించిన మాస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఉచితంగా స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బ్లడ్ సీరమ్ క్రియేటినిన్ పరీక్షలు చేశారు. దేశంలోని వందకు పైగా ప్రదేశాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అపోలో హెల్త్ లైఫ్ స్టైల్ లిమిటెడ్ సీఈవో శ్రీరామ్ అయ్యర్ మాట్లాడు తూ మూత్రపిండాల వ్యాధుల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. అపోలో డయాలసిస్ క్లినిక్‌లు సీవోవో సుధాకర రావు మాట్లాడుతూ మూత్రపిండాల వైఫల్యం ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్య అన్నారు. ప్రభుత్వ అంచనా ప్రకా రం.. భారతదేశంలో సంవత్సరానికి దాదాపు 2.20 లక్షల మంది రోగులు చివరి దశలో మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. దాదాపు 5000 డయాలసిస్ కేంద్రాలు, దాదాపు 3340 మంది నెఫ్రాలజిస్ట్‌లు డయాలసిస్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ జెండా ఆవిష్కరణలో సీనియర్ నాయకులు

ఎర్రగడ్డ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏర్పాటులో భాగమవుతుందని, దానికి అవసరమైన తోడ్పాటును అందరం కలిసి అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు బడే విశ్వేశ్వరరావు, శ్రీధర్, వెంకట నరసింహారావు, మట్ట శ్రీనివాస్, నాగేంద్ర, సురేష్, మతి శ్రీనివాస్, ఆరేటి ప్రభు చైతన్య, ఎస్ రాధాకృష్ణ, సైదులు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, హేమలత, సూర్యకుమారి, ప్రసాద్, భాస్కర్, లక్ష్మణ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనిధి కిడ్స్ క్యాజిల్ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న చిన్నారులతో పాఠశాల డైరెక్టర్లు లక్ష్మణ్‌రావు, కృష్ణవేణి సుకుమార్, అధ్యాపకులు

పంజాగుట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ కల్యాణ్ నగర్ వెంచర్-1లోని శ్రీనిధి కిడ్స్ క్యాజిల్ యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే గురువారం ఘనంగా జరిగాయి. మధురానగర్‌లోని శ్రీసాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలో చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్లు కొల్లి లక్ష్మణ్‌రావు, కృష్ణవేణి సుకుమార్, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, విజయలక్ష్మి, రాజేశ్వరి, సమన్వయకర్త సాయిరాం, సాయిశ్రీ, పూజ, శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం బాధ్యతగా భావించాలి



రక్తదానం చేస్తున్న రామకృష్ణ

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ విధిగా ముందుకురావాలని సామాజిక సేవకుడు పుట్టా రామకృష్ణ అన్నారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మాత్రం భయం పోవడం లేదని, ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న వేల మంది రక్తం సమయానికి దొరక్క ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బంజారాహిల్స్ ఓ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేసుకునేందుకు రక్తం లేక ఎదురుచూస్తున్న రోగికి గురువారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఇప్పటి వరకు 59 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. యువత రక్తదానం చేసేందుకు పెద్దసంఖ్యలో ముందుకు రావాలని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

గృహ కార్మికులు, గార్బేజ్ కలెక్టర్స్ కోసం సమగ్ర చట్టం తేవాలి



డిమాండ్ల పోస్టరును ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, దీపక్ జాన్, వర్గీస్ తేకనాథ్, సంధ్య, సజయ, తదితరులు

పంజాగుట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గృహ కార్మికులు, గార్బేజ్ కలెక్టర్స్ కోసం సమగ్ర చట్టం తేవాలని, డిమాండ్లను పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు, వక్తలు డిమాండ్ చేశారు. మోంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్(ఎం.ఎస్.ఐ),గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టర్స్ కలెక్టివ్ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఎం.ఎస్.ఐ డైరెక్టర్ వర్గీస్ తేకనాథ్, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య, సామాజిక కార్యకర్త కె.సజయ, గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, కలెక్టివ్ సంస్థ గ్రేటర్ అధ్యక్షురాలు నాగమణిలతో కలిసి గృహ కార్మికులు, గార్బేజ్ కలెక్టర్స్ డిమాండ్ల పోస్టరును ఆవిష్కరించారు. రాష్ట్రంలో 11 లక్షల మంది గృహ కార్మికులు, నగరంలో 70 వేల మంది ఇళ్లల్లో నుంచి చెత్తను, వ్యర్థాలను సేకరించే కార్మికులు ఉన్నారన్నారు. కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సమగ్ర చట్టం తేవాలని వారు డిమాండ్ చేశారు.



విజయరామారావు వర్ధంతి కార్యక్రమంలో కూతురు అన్నపూర్ణ

విజయరామారావు సేవలు మరువలేం

బోరబండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వీకర్ సెక్షన్‌లోని బలహీన వర్గాల గృహ సముదాయం కోసం మాజీ మంత్రి, సీబీఐ డైరెక్టర్ స్వర్గీయ కె.విజయరామారావు(కేవీఆర్) చేసిన సేవలు మరువలేనివని ఆయన కూతురు అన్నపూర్ణ అన్నారు. కేవీఆర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా బోరబండ సైట్-3 ఎన్టీఆర్ విగ్రహం వద్ద మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కేవీఆర్ వీకర్ సెక్షన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ అనుచరులు షర్మిలా జాదవ్, కిలారి మనోహర్, రాజ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీరియల్ నటి భర్తపై కేసు

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బుల్లితెర సీరియల్ నటి భర్తపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుల్లితెర నటి ఐశ్వర్యకు గతేడాది డిసెంబర్‌లో వైజాగ్‌కు చెందిన శ్యామ్‌కుమార్‌తో వివాహమైంది. కొద్ది రోజులకే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో దూరంగా ఉంటున్నారు. వీరి వివాహం కన్నా ముందే కమలాపురి కాలనీలో నివాసముండే కె.రమేష్‌బాబుతో ఐశ్వర్యకు పరిచయం ఉంది. దీన్ని అడ్డుగా పెట్టుకున్న శ్యామ్ కుమార్ గతేడాది రమేష్‌బాబుకు ఫోన్ చేశాడు. ఐశ్వర్య, రమేష్‌బాబుకు సంబంధించిన కొన్ని చిత్రాలు తన వద్ద ఉన్నాయని వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయకుండా ఉండాలంటే రూ. పది లక్షలు కావాలని డిమాండ్ చేశాడు. తాను ఎటువంటి తప్పు చేయకపోవడంతో రమేష్‌బాబు పట్టించుకోలేదు. ఐశ్వర్య, రమేష్‌బాబు కలిసి ఉన్న కొన్ని ఫొటోలను శ్యామ్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. కొన్ని యూట్యూబ్ వీడియోల్లో శ్యామ్ మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ 10న వీరిద్దరు కలిసి ఉన్న ఫొటో అని చెప్పాడు. శ్యామ్ పేర్కొన్న తేదీలో తాను వ్యాపార పనుల నిమిత్తం ఆస్ట్రేలియాలో ఉన్నట్టు ఆధారాలు, స్టాంపింగ్‌లు ఉన్నాయని డబ్బుతో పాటు తన పరువు తీసేందుకే శ్యామ్‌కుమార్ అబద్ధపు ప్రచారం చేస్తున్నాడని పేర్కొంటూ రమేష్‌బాబు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు 385,504,506ఐపీసీతో పాటు సెక్షన్ 66,67 ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ 'ఆపిల్' ఉత్పత్తులు అమ్ముతున్న మహిళల అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆపిల్ కంపెనీకి చెందిన నకిలీ ఉత్పత్తులను అమ్ముతున్న ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు-36లో క్రోమా షోరూం సమీపంలో ఇద్దరు మహిళలు ఆపిల్ కంపెనీ ఉత్పత్తులు తక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిసింది. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి తనిఖీలు చేయగా నకిలీ ఉత్పత్తులను అమ్మి మోసం చేస్తున్నట్టు తేలింది. అమ్మకం చేస్తున్న నాందేవ్ బెల్దార్, మందాపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌షాప్‌లో సిగరెట్లు, నగదు చోరీ

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాన్‌షాప్‌లో సిగరెట్లు, నగదు చోరీకి గురయ్యాయి. ఫిలింనగర్ ఎమ్మార్పీ కాలనీకి చెందిన కె.చంద్రశేఖర్ బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-2 జపనీస్ పార్క్ పక్కనే పాన్‌షాప్ పెట్టుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈనెల 11న రోజు మాదిరిగా షాపు మూసి వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వచ్చేసరికి తాళం పగలుకొట్టి ఉంది. లోపల చూడగా రూ. 31వేలు విలువ చేసే 197సిగరెట్ ప్యాకెట్లు, రూ.3 వేలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి అమ్ముతున్న మహిళ అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-13లో నివసించే గుండెపల్లి స్టాన్ క్రిసెస్ అలియాస్ షీనా ములానీ ప్రైవేట్ ఉద్యోగి. అదనపు ఆదాయం కోసం గంజాయి అమ్మకాలు మొదలు పెట్టింది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి స్టాన్ క్రిసెస్‌ను అదుపులోకి తీసుకొని 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉన్నత విద్యలో మార్పులు

పంజాగుట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానం ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకొస్తుందని, ప్రపంచంలోని మేటి విశ్వవిద్యాలయాలకు దీటుగా మన విద్యార్థులను తీర్చిదిద్దెందుకు దోహదపడుతుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్.సి.మల్లయ్య అన్నారు. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతదేశంలో ఉన్నత విద్య-సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు: నూతన విద్యా విధానంలో సవాళ్లు-అవకాశాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సులో ఉస్మానియా విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఇ.డిసీ, రాజనీతి శాస్త్రం విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఆర్. చంద్రు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెచ్‌ఓడీ సి.అరుణ జ్యోతి,కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర కుమార్, వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో శుక్రవారం నుంచి విజయ లక్ష్మి అమ్మవారి 30వ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈసందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి గురువారం ఆలయంలో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 30సంవత్సరాలుగా దేవాలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎన్.వీ.రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుడు చెన్నయ్య

అవార్డుకు ఎంపికైన భాస్కరరావు

బోరబండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సైట్-3కి చెందిన యక్షగాన కళాకారుడు మారెడు చెన్నయ్య మున్నంగి భాస్కరరావు అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం చెన్నయ్య బోరబండలో మాట్లాడుతూ.. శివాని ఆర్ట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగే మున్నంగి భాస్కరరావు 83వ వర్ధంతిలో అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు ఎంపిక చేసిన నిర్వహణ కమిటీకి చెన్నయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: యెగ్గే మల్లేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం కురుమ

పంజాగుట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ, తదితర అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉన్న కురుమ సామాజిక వర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా కురుమ కార్పొరేషన్, షీప్ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం కురుమ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఏర్పాటు చేస్తామని తీర్మానించిందని, దీని ప్రకారం గొల్ల, కురుమ కార్పొరేషన్‌ను ప్రకటించిందన్నారు. కురుమలు, యాదవులు వేర్వేరు అన్నారు. తాము బీసీ-బి గ్రూపులో ఉండగా, యాదవులు బీసీ-డి గ్రూపులో ఉన్నారన్నారు. షీప్ ఫెడరేషన్‌లో కూడా అన్యాయం జరుగుతోందని, ఫెడరేషన్ చైర్మన్‌గా తమ సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించాలన్నారు. త్వరలో సీఎంను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బి.నగేష్, నర్సింహ, అరుణ్ కుమార్, విజయ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ(సీ)రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి

సికింద్రాబాద్, మెదక్ పార్లమెంట్ స్థానాల్లో ఎస్‌యూసీఐ పోటీ

- అభ్యర్థులను ప్రకటించిన పార్టీ

పంజాగుట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేయడానికి దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు)రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ తరుపున రెండు స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఆయన ప్రకటించారు.

సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి డాక్టర్ ఆర్.గంగాధర్, మెదక్ పార్లమెంటు నుంచి బి.శ్రీనివాస్ పోటీ చేస్తారన్నారు. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో 151 పార్లమెంటు స్థానాల్లో తమ అభ్యర్థులను పోటీకి నిలబెట్టుతున్నామన్నారు. వామపక్ష పార్టీలు అయిన సీపీఐ, సీపీఎంలు ఉద్యమ బాటను విడిచిపెట్టి ఓట్లు, సీట్ల కోసం పెట్టుబడిదారీ దోపిడీ వర్గానికి నమ్మినబంటైన కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జానీ భాష, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి పి.తేజ, అభ్యర్థులు ఆర్.గంగాధర్, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ 57 ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చింతల రాజలింగం, తదితరులు

పంజాగుట్ట, మార్చి14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎస్సీ 57 ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతల రాజలింగం మాట్లాడుతూ సుమారు 30 లక్షల జనాభా ఉన్న ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తనని వేం నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణాల మంగేష్, ఉపాధ్యక్షుడు ఎర్పుల యాదయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ప్రత్యే క సూప్రభాత సేవ అనంత రం సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నకిలీ వస్తువులను విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- బేగంబజార్‌లోని దుకాణాలపై పోలీసుల దాడి
- రూ.4.17 లక్షల విలువ చేసే కాస్మొటిక్ వస్తువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నకిలీ కాస్మొటిక్స్, నిందితుడు అహ్మద్ లష్కర్

అఫ్జల్‌గంజ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ కాస్మొటిక్, నకిలీ మిరియాలు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. షాహినాథ్‌గంజ్ పోలీసులు బుధవారం రాత్రి బేగంబజార్‌లో ఓ దుకాణంపై దాడి చేసి రూ.4.17 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన నకిలీ కాస్మొటిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఇన్‌స్పెక్టర్ ఎల్ బాలు చౌహాన్ వివరాలను వెల్లడించారు. బేగంబజార్ ఫీల్‌ఖానాకు చెందిన తబీర్ అహ్మద్ లష్కర్ (37) 7స్టార్ కాస్మొటిక్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా వివిధ పేరొందిన కంపెనీలకు చెందిన నకిలీ బెబీ లిప్‌బామ్, కాజల్, లిపిస్టిక్ వంటివి విక్రయిస్తున్నట్టు విశ్వసనీయమైన సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాథ్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా '7స్టార్ కాస్మొటిక్' దుకాణంపై బుధవారం రాత్రి దాడులు నిర్వహించి నకిలీ కాస్మొటిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కాపీ రైట్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో షాహినాథ్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలు చౌహాన్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగార్జున, కవియుద్దీన్, పి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

మోదీ రోడ్ షోను విజయవంతం చేద్దాం

చిలకలగూడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరిలో శుక్రవారం నిర్వహిస్తున్న ప్రధాని మోదీ రోడ్ షోను విజయవంతం చేద్దామని బీజేపీ జాయింట్ కన్వీనర్ రాజేష్ తెలిపారు. గురువారం మెట్టుగూడలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు ఐకమత్యంతో పని చేయాలని, మోదీకి స్వాగతం పలికి రోడ్ షోను జయప్రదం చేయడానికి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపరింటెండెంట్ రాజారావు

గాంధీలో ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం

అడ్డగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ రాజారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీలు మానవ శరీరంలో ముఖ్యమైనవని వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ రెడ్డి, నెఫ్రాలజీ విభాగం వైద్యులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

పద్మారావునగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగుడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆనందంతో కేరింతలు వేస్తూ నృత్యం చేశారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పి వీడ్కోలు పలికారు. పరీక్షకు హాజరవుతున్న 45 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు హాల్ టిక్కెట్లు అందజేశారు.

గణపతి ఆలయంలో ప్రవచనాలు

చిలకలగూడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఋషిపీఠం సత్సంగం, హైదరాబాద్ ఆధ్వర్యంలో సాకేత్‌కాలనీ, గణపతి ఆలయంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ భాగవత ప్రవచనాలు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి ప్రవచనాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ ఒకటవ తేది వరకు ప్రవచనాలు కొనసాగుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

టీకొట్టు యజమాని దారుణ హత్య

రాంనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధం కారణంగా హోటల్ నిర్వాహకుడు దారుణహత్యకు గురయ్యాడు. అతడి వద్ద పనిచేసిన వ్యక్తే పట్టపగలు అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచాడు. పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి భోలక్‌పూర్‌లో గురువారం మధ్యాహ్నం ఈ దారుణం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్‌పూర్‌లోని మండీగల్లీ వద్ద మహ్మద్ గౌస్(45) కొంతకాలంగా మాలిక్ ఛాయ్ హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య నూర్జహాన్, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు మేడ్చల్ జిల్లాలోని డబీర్‌పురలో నివాసం ఉంటున్నారు. గౌస్ భోలక్‌పూర్‌లో హోటల్ నిర్వహిస్తూ రెండు రోజులు ఇక్కడ, రెండు రోజులు డబీర్‌పురకు వెళ్లి వస్తుంటాడు. హోటల్ వద్దే ఓ రూమ్‌ను అద్దెకు తీసుకుని అందులో ఉంటున్నాడు. ఈ క్రమంలో గౌస్‌కు ఆ ఇంటి మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ మహిళ భర్త కూడా చనిపోయాడు. అప్పటి నుంచి గౌస్‌కు ఆ మహిళతో వివాహేతర సంబంధం మరింత బలపడింది. ఇదిలా ఉండగానే గౌస్ వద్ద హోటల్‌లో పనిచేస్తున్న ఫయాజ్ అహ్మద్(45)తో కూడా ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆ మహిళను వివాహం చేసుకున్నానని ఫయాజ్ బయట ప్రచారం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గౌస్ అతడిని పనిలో నుంచి తీసేసి అక్కడి నుంచి బయటకు పంపించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. గత శనివారం ఫయాజ్ అహ్మద్, గౌస్‌లు మళ్లీ గొడవపడ్డారు. దీంతో గౌస్‌ను హతమార్చాలని ఫయాజ్ పథకం వేశాడు. గురువారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో టీ కొట్టులో ఉన్న గౌస్ వద్దకు వచ్చాడు. తన వద్ద ఉన్న కత్తితో గౌస్ మర్మాంగాల సమీపంలోనూ, తొడపైన, పొత్తికడుపులో పొడిచాడు. గౌస్ తీవ్ర రక్తస్రావంతో అక్కడే ఉన్న మెట్లపై పడిపోయాడు. ఈ విషయం తెలిసిన స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గౌస్‌ను అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి గౌస్ మృతిచెందాడు. నూర్జహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారణాలపై విచారణ చేస్తున్నట్లు ఏసీపీ రమేష్‌కుమార్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కాగా, నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం.

ప్రజలకు ఎన్నికలపై విశ్వాసం పెరగాలి

- బోయినపల్లిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

బోయినపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తామని బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల్లో నమ్మకం, భరోసా కలిగేలా బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, ఐటీబీపీ కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్ కవాతును పోలీస్ స్టేషన్, కంసారిబజార్, హనుమాన్ టెంపుల్, వి ఆర్ హాస్పిటల్, ఆర్యసమాజ్, జయనగర్, బాపూజీనగర్, పవన్ విహార్ కాలనీ, బాపూజీనగర్, పెట్రోల్ బంక్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలకు పోలీసులు తోడుంటారని, ప్రజలకు ధైర్యాన్ని కల్పించడానికి పోలీస్ శాఖ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఫ్లాగ్ మార్చ్ అన్ని ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలకపాత్రను పోషిస్తాయని, ప్రతి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతో కూడిన బీఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. మీ ప్రాంతాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎస్ఐలు నాగేంద్రబాబు, రాజు, శివశంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు, స్థానికులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి



మహిళలకు చీరలను అందజేస్తున్న వేణుగోపాల్ స్వామి

కాంగ్రెస్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి

రెజిమెంటల్‌బజార్, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే మహిళలు ఆర్థికాభివృద్ధి చెందటానికి సాధ్యమవుతుందని సికిందరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ స్వామి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ, వేణుగోపాల్ స్వామి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యభై శాతం నామినేటెడ్ పోస్టులను మహిలలకు కేటాయించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు.

కార్యక్రమంలో వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జయకర్ డేనియల్, ప్రధాన కార్యదర్శి లినార్డ్ షైరిన్, సెంటినరీ బాప్టిస్టు చర్చి మాజీ అధ్యక్షుడు రాబర్ట్ సుర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోట నీలిమ

సమస్యల పరిష్కారానికి కృషి: కోట నీలిమ

రాంగోపాల్‌పేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏఐసీసీ సభ్యురాలు డాక్టర్ కోట నీలిమ అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని విక్టోరియా రాణిగంజ్ బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలు ఎలా ఉండకూడదో మీరందరూ దశాబ్దకాలంగా చూశారన్నారు. రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన ఎలా ఉంటుందో మీరు చూస్తున్నారన్నారు. బస్తీలో నీటి సమస్య ఉందని బస్తీవాసులు నీలిమ దృష్టికి తీసుకురాగా త్వరలో రెండు పవర్ బోర్లను వేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద ఇస్తున్న ఐదు లక్షల రూపాయలను అందరికీ అదేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ శివకుమార్ లాల్, బస్తీ అధ్యక్షుడు ఎస్ఆర్ మల్లేష్, హేమంత్ సింగ్, శివ, లావణ్య, చంద్ర శేఖర్, కుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

పర్యాటకు రంగంలో డ్రైవర్ల పాత్ర కీలకం

- టూరిజానికి బ్రాండ్ అంబాసిడర్లుగా క్యాబ్ డ్రైవర్లు
- ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ జయదేవ్

శంషాబాద్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో క్యాబ్ డ్రైవర్లది కీలక పాత్ర అని, టూరిజానికి వారు బ్రాండ్ అంబాసిడర్లు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతిథి దేవోభవ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది క్యాబ్‌డ్రైవర్లకు రెండు సెషన్లలో ప్రయాణికులు, పర్యాటకుల పట్ల పాటించే మర్యాదలు, పరిశుభ్రత, సీపీఆర్ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జయదేవ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే క్యాబ్/ఆటోడ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. అతిథి దేవో భవ కార్యక్రమం కింద దాదాపు 200 మంది క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ అందించినట్లు ఆయన తెలిపారు. క్యాబ్ డ్రైవర్లకు సీపీఆర్ కిట్లను అందజేశారు. టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ, జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, అపోలో హాస్పిటల్స్, కోఠారి గ్రూప్, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, ఐఐహెచ్ఎం త్రిపుర కన్‌స్ట్రక్షన్ సంస్థల భాగస్వామ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జయదేవ్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, జీఎంఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరంలో పాల్గొన్న క్యాబ్‌డ్రైవర్లు



బోయినపల్లి మార్కెట్ యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బోయినపల్లి మార్కెట్‌యార్డులో అగ్నిప్రమాదం

బోయినపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బోయినపల్లి మార్కెట్ యార్డులో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. సకాలంలో అధికార యంత్రాంగం స్పందించడంతో పెనుముప్పు తప్పింది. బోయినపల్లి మార్కెట్ యార్డు దేశంలోనే అతిపెద్ది. ప్రతి నిత్యం కోట్లలో వ్యాపారాలు జరుగుతుంది. నిత్యం వేల సంఖ్యలో రైతులు వచ్చి తమ పంటను అమ్ముకుని వెళ్లిపోతుంటారు. 4 గంటలకు తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతాయి. అనంతరం మార్కెట్‌లో రద్దీ ఉండదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 5 గంటల 45 నిమిషాల ప్రాంతంలో మార్కెట్ యార్డులోని గోదాముల వద్ద మంటలుచెలరేగాయి. దీంతో పొగ కమ్ముకుంది. ఇది గమనించిన స్థానికులు మార్కెట్ యార్డులో అగ్నిప్రమాదం జరిగిందని తిరుమలగిరి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్ఐ శ్రీకాంత్‌లు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఈ గోదాములలో పెద్ద ఎత్తున కూరగాయలు నిలువ ఉన్నాయి, గోదాములోపల మంటలు వ్యాపించకుండ అధికారులు చర్యలు తీసుకోవడతో పెనప్రమాదం తప్పింది. సకాలంలో స్పందించి మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బందికి మార్కెట్ యార్డు అధికారులు, పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. షాట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని ఇన్‌స్పెక్టర్ మధుబాబు వెల్లడించారు.

సెల్‌ఫోన్ స్నాచర్ల అరెస్టు, రిమాండు

అడ్డగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం... ఈ నెల 10న సినీ కో-డైరెక్టర్‌గా పని చేసే రాజమౌళి పని నిమిత్తం చిక్కడపల్లికి వెళ్లి అక్క డి నుంచి జూబ్లిహిల్స్‌లో మరో స్నేహితుడిని కలిసేందుకు బైకుపై వెళుతున్నాడు. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోస్టేషన్ ప్రాంతంలో నిలబడి ఉన్న రాజమౌళి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను బైకుపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కొట్టేసి పారిపోయారు. వెంటనే బాధితుడు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. బుధవారం సికింద్రాబాద్‌లో మఫ్టిలోఉన్న కానిస్టేబుల్ మహ్మద్ అహ్మద్, రవి కుమార్‌లతో పాటు పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా సంగీత్ నుంచి బైకుపై వస్తున్న ఇద్దరిని అనుమానంతో బైకును ఆపారు. బైకు పత్రాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివిధ కోణం లో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సెల్‌ఫోన్ గ్యాంగ్ అని తేల్చారు. నిందితులు దమ్మాయిగూడకు చెందిన షేక్ హామెద్ (21), డబీర్‌పురకు చెందిన షేక్ హాఫీజ్ ఉద్దిన్(20)ఇద్దరు సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారని విచారణలో తెలింది. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు.



చైన్ స్నాచర్లు



శంకుస్థాపన చేస్తున్న ఓయూ వీసీ డాక్టర్ రవీందర్ తదితరులు

ఓయూలో ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

- సుమారు రూ.10.16 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఫౌండేషన్ భవన్

తార్నాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో సుమారు రూ.10.16 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణ పనులకు గురువారం ఓయూ వీసీ డా.రవీందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ డా.రవీందర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో మహనీయులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీకి ఉందన్నారు. ఓయూ అభివృద్ధికి ఆలంబనగా నిలిచేవిధంగా ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా భవిష్యత్‌లో యూనివర్సిటీ పూర్వ విద్యార్థులకు, విశ్వవిద్యాలయానికి మధ్య ఉస్మానియా ఫౌండేషన్ భవన్ వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, ఓయస్‌డీ ప్రొ.బి. రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ కార్యాలయం సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్

- అప్రమత్తమైన సిబ్బంది

మారేడ్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన రహదారిలో ఉన్న ఓ రియల్ ఎస్టేట్ ప్రధాన కార్యాలయం సెల్లార్‌లో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. విద్యుత్ సిబ్బంది, స్టాఫ్ సకాలంలో స్పందించి తగిన తీసుకోవడంతో దట్టమైన పొగను అదుపులోకి తెచ్చారు. దీంతో ఆ కార్యాలయంలో ఉన్న సిబ్బందికి ఎలాంటి ప్రమాదం, ఆస్తి నష్టం జరగకుండా పరిస్థితిని చక్కదిద్దారు. అప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకొని విద్యుత్‌ను నిలిపివేశారు. విద్యుత్ స్తంభం నుంచి సర్వీస్ వైర్‌ను సెల్లార్‌లో ఏర్పాటు చేసిన మీటర్ల వద్దకు కనెక్షన్ ఇచ్చారు. స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి సర్వీస్ వైర్ కాలిపోయింది. దీంతో ఈ క్రమంలో సెల్లార్‌లోని ఉన్న వైర్లు వద్ద దట్టమైన పొగలు కమ్మేసాయి. ఎవరికి ఏలాంటి ప్రమాదం, ఆస్తి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మేము అన్ని రకాల ముందస్తు చర్యలు పాటిస్తూ ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా నిబంధనలో పాటిస్తున్నామని తమ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్‌తో కొంచెం ఇబ్బంది కలిగిందని కార్యాలయ నిర్వాహకులు పేర్కొన్నారు. తమ కార్యాలయంలో అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ఆస్తి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు.



అగ్నిమాపక రసాయనాలే స్ప్రే చేస్తున్న కార్యాలయం విద్యుత్ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి

హక్కుల సాధనకు మహిళలు పోరాడాలి

అడ్డగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం అడ్డగుట్టలో బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాలులో ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కుల కోసం తెలుసుకోవాలంటే మహిళల్లో చైతన్యం రావాలన్నారు. మహిళలు చదువున్నప్పుడే ఆ కుటుంబం అన్ని రంగాల్లో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, అడ్డగుట్ట పీహెచ్‌సీ ఉమ, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శంకర్, ఎంవీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఏవీఎం స్వామి, జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, తల్లుల సంఘం మండల కన్వీనర్ జమున, రెమెడియన్ సెంటర్ టీచర్లు సుమలత, లావణ్య, కాంతిరేఖ, తదితరులు పాల్గొన్నారు.



నరసింహన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విదార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలి

తిరుమలగిరి మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నరసింహన్ కన్నన్ పిలుపునిచ్చారు. గురువారం మడ్‌ఫోర్డ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించడానికి వెళ్తుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుప్రజ, టీచర్స్ పద్మావతి దేవేందర్ రెడ్డి, రమేష్, పద్మజ, శ్రీదేవి, సైదులు, భాస్కర్ పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం

ఎస్సీ 57 ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పంజాగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎస్సీ 57 ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతల రాజలింగం మాట్లాడుతూ సుమారు 30 లక్షల జనాభా ఉన్న ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తానని వేం నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణాల మంగేష్, ఉపాధ్యక్షుడు యాదయ్య, నాయకులు ఉన్నారు.

భార్యా భర్తల మధ్య గొడవ.. భార్య అదృశ్యం



నయోమి

జవహర్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భార్య అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలపర్తి ఇస్మాయిల్ మేస్త్రీ పని చేస్తూ భార్య నయోమి, ముగ్గురు కుమారులు, కుమార్తెతో కలిసి జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. తరుచూ భార్యాభర్తలు గొడవపడతారు. ఈ నెల 11న రాత్రి కటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. ఇస్మాయిల్ ఉదయం లేచి చూసే సరికి భార్య నయోమి (38) కనపడలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కింద పడి తీవ్ర గాయాలతో నెల రోజులగా చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది న ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాలు ప్రకారం... సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలో ఓషాపు వద్ద గుర్తుతెలియని(40) ఏళ్ల వ్యక్తి ఫిబ్రవరి 15న మద్యం మత్తులో రోడ్డుపై కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అతన్ని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. నెల రోజులగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రికి వెళ్లి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... మనోహరాబాద్-మేడ్చల్ రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తుతెలియని(45) ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వ్యక్తిగత కారణాల కారణంగానే ఆత్మహత్య చేసుకోవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పసుపు రంగు టీ షర్టు, క్రీం రంగు పాయింట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో...

రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీ కొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరీ తెలిపిన వివరాల ప్రకారం... లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని(35) ఏళ్ల వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బుడిద రంగు టీ షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.